“చెప్పు బాబూ, ఫర్వాలేదు” బుజ్జగించాడు  పట్టాభి.

“చెపితే నువ్వు లాగేసుకుంటావు”కళ్ళు ఆశ్చర్యంగా పెద్దవి చేసి అతన్ని దొంగలా చూస్తూ అన్నాడు.

అతనికి సర్రున కోపం వచ్చింది “నేను లాగేసుకోను బాబూ”

“లాగేసుకోనప్పుడు మీకు నా బొమ్మల గురించి వివరాలెందుకు?”

ఆ కుర్రాడితో మాట్లాడటం కష్టమనిపించింది అతనికి. పరమశివం కాని తన కొడుక్కి ట్రైనింగ్ ఇచ్చాడా?

ఏమయినా పోలిస్ ఛేజింగ్, డ్రామా ఆడింది మాత్రం ఈ కుర్రాడే, ఆడించింది పరమశివంగాడే.

సరిగ్గా ఇదే సమయంలో ముందు వెళుతున్న పరమశివానికి, మధుమూర్తికి మధ్య ఘర్షణ జరుగుతోంది.

“అవన్నీ నాకనవసరం, తప్పంతా మీది. ఈ తప్పుకు నేనెందుకు నష్టపోవాలి. మర్యాదగా నా వాటా నాకిచ్చేస్తేనే వెళ్ళిపోతాను.  లేదంటే బూడిదయిన నిజాన్ని బయటకు లాగవలసి వస్తుంది” మొండిగా అన్నాడు పరమశివం.

మధుమూర్తి గుండెల్లో రాయిపడినట్లయింది.  అంతలోనే తిరిగి సర్దుకుంటూ...
“ఇప్పటికిప్పుడు తెమ్మంటే ఎలా తేగలం?” తనూ బెదిరిస్తున్నట్లుగానే అన్నాడు అతను.

“ఇప్పటికిప్పుడేం అక్కరలేదు.  సరిగా పదిహేనురోజుల్లో యిస్తేచాలు.”

“ఇవ్వకపోతే?”

“ఇవ్వకపోతే ఏం జరుగుతుందో ఇందాకే చెప్పాను.”

“ఆ లోపు పాపం నీకేదన్నా జరిగితే?” సౌమ్యంగానే అన్నా అందులో పాము బుస వినిపించింది పరమశివానికి.

“అందుకే అన్ని వివరంగా వ్రాసి ఓ మిత్రుడి దగ్గర వుంచాను. ఈ లోపు నా కేదన్నా జరిగితే మీ మూలంగానే జరుగుతుందని అందులో వ్రాశాను”

ఓ క్షణం భయంగా చూశాడు మధుమూర్తి .

వెంటనే అతనికేం మాట్లాడాలో పాలుపోలేదు.  వెనుతిరిగి చూశాడు.

ఉదయ్ నోటెంట ఆ పని చేసింది నేనేనని చెప్పించగలిగితే దాన్ని అడ్డం పెట్టుకుని పరమశివాన్ని బెదిరించవచ్చు.  కానా సూచనలేవీ పట్టాభి ముఖంలో కనిపించటంలేదు.

“సరే.... పట్టాభితో మాట్లాడి నీ వాటా సెటిల్ చేస్తాను” అన్నాడు రాజీ ధోరణి నటిస్తూ.

కానీ మధుమూర్తికి తెలుసు. పదిహేనురోజుల్లో వడ్డీతో సహా పరమశివం  వాటా అతనికిచ్చేస్తే లక్షల్లో నష్టం వస్తుందని.

మరో రెండు నిముషాలకు వాళ్ళు విడిపోయారు.

“కుర్రాడేమన్నా చెప్పాడా” మధుమూర్తి  ఆత్రుతగా అడిగాడు.

“చాలా చెప్పాడు”

“పోలీసు విజిల్, సైరన్ బొమ్మలు కొన్నది తనేనని చెప్పాడా?”

“నేను దొంగలా కనిపిస్తున్నానా?” పట్టాభి సీరియస్‌గానే అడిగాడు అతన్ని.

మధుమూర్తి అర్ధంకానట్లు చూశాడు.

“ఆ కుర్రవెధవకి అలాగే కనిపించాను. అందుకే తను కొన్న బొమ్మల వివరాలు చెప్పను అన్నాడు”

మధుమూర్తి అంత బాధలోను పెద్దగా నవ్వాడు.

“ఆ బచ్చాగాడు చాలా తెలివికలవాడు. నీ ముఖాన్ని బట్టి, నీ ఆరాను బట్టి జాగ్రత్త పడి వుంటాడు. వాడే ఆ పని నిజంగా చేసుంటే....”

“చత్, నోర్ముయ్ ఆ పని చేసింది వాడే. అందులో సందేహం లేదు. వాడికి అబద్ధం చెప్పటం ఇష్టంలేదు. చెప్పడని మనకి తెలుసని కూడా వాడికి తెలుసు.”

“నిజంగా ఆ కుర్రాడు తెలివి కలవాడే. లేదంటే నువ్వు దొంగ వెధవని ఎలా కనిపెడతాడు” అతను తమాషాకి అన్నాడు.

పట్టాభి అతనివేపు గుర్రుగా చూశాడు.

“సరేలే..నీ చూపులతో బెదిరించాల్సింది నన్నుకాదు పరమశివాన్ని. పదిహేను రోజులలో వడ్డీతో సహా తన వాటా తనకి పడెయ్యకపోతే మనతో జైలు ఊచలు లెక్కిస్తానని బెదిరించాడు”

మధుమూర్తి మాటలు పూర్తవుతుండగానే అతని కళ్ళు నిప్పులు చెరిగాయి.

“చూస్తా వాడి వాటాసంగతి, నిజంగానే చూస్తా. త్వరగా పద. ముందు చిన్నపిల్లల బొమ్మలమ్మే షాప్స్‌లో మన వేట ప్రారంభించాలి. ఆ తర్వాత ఉదయ్‌గాడికి ఎందరు ఫ్రెండ్స్ వున్నారో శోధించాలి. పరమశివంపై దుర్గాదాసు నిఘా పెట్టాలి.”

నడకాలో వేగం పెంచుతూ అన్నాడు ఆతను.

*   *   *

“అడిగాడా?” పరమశివం ఆతృతగా అడిగాడు.

“అడిగాడు... అబద్ధం చెప్పను కదా.”

“చెప్పేశావా?” భయంగా చూశాడు అతను.

“అబద్ధం చెప్పలేదు, నిజం దగ్గరకు రానివ్వలేదు” కొడుకువేపు విస్మయంగా చూశాడు పరమశివం .

“నువ్వే చెప్పావు కదా చచ్చినా అబద్ధం చెప్పకూడదని.... నిజం చెపితే మనల్ని చంపేస్తారని కూడా చెప్పావ్. అబద్ధం చెప్పకుండానే మన ప్రాణాలు దక్కాలి. అంతే... నిజం దగ్గరకు రానివ్వకూడదు. అంతేగా నాన్నా?”

పరమశివం కొడుకు తెలివితేటలకి విస్మయపడ్డాడు “అంతే..అంతే.. మరింకా విషయాన్ని మర్చిపో” అన్నాడు పరమశివం కొడుకును స్కూల్ దగ్గర వదిలేస్తూ.

0 0 0

సాయంత్రం నాలుగు కావటానికి మరో నిమిషమే వుందనగా పట్టాభి, మధుమూర్తి స్కూల్ గేటుకి దగ్గరలో వున్న చిల్లర దుకాణంలోకి వెళ్ళి ఆ కొట్టువాడితో ఏదో మాట్లాడి అతని చేతిలో ఓ పది రూపాయలుంచారు.

తర్వాత ఆ కొట్లోనే ఓమూలగా కూర్చుని స్కూల్ గేటు కేసి దృష్టిని సారించాడు.

సరిగా నాలుగవుతుండగా స్కూల్ గంట వినిపించటం, పిల్లలు బిలబిలమంటూ బయటకు దూసుకురావడం జరిగింది.

పట్టాభి కళ్ళు అంతమంది విద్యార్థుల్లోనూ ఉదయ్‌ని గుర్తుపట్టగలిగాయి. ఉదయ్ ప్రక్కన మరో కుర్రాడున్నాడు. ఇద్దరూ మాట్లాడుకుంటూ ముందుకు సాగిపోతున్నారు.

పట్టాభి సైగనందుకుని మధుమూర్తి కొట్లోంచి చటుక్కున బయటికొచ్చేశాడు. ముందు వెళ్తున్న ఉదయ్‌ని, ప్రక్కనున్న-కుర్రాడ్ని అనుమానం రాకుండా
అనుసరించసాగాడు.

మరి అయిదు నిమిషాలకి ఆ ఇద్దరూ విడిపోయారు. మధుమూర్తి ఇప్పుడే ఉదయ్‌ని వదిలేసి రెండోకుర్రాడ్ని అనుసరించ సాగాడు.

ఆ కుర్రాడు నేరుగా తన యింటికి వెళ్ళకుండా తాపీగా ఆడుకుంటూ, గంతులేస్తూ అరగంటకి ఇంటికి చేరుకున్నాడు. మధుమూర్తి ఆ యింటిని గుర్తు పెట్టుకున్నాడు.

పట్టాభి, మధుమూర్తి కి పరమశివం ఇచ్చిన గడువు దగ్గరకొచ్చేసింది.

మరో అయిదురోజుల్లోనే అతని వాటాను అణాపైసలతో సహా సెటిల్ చేయాలి.

ఇవ్వకుండా బెదిరిద్దామనుకుంటే తనకేదన్నా ప్రమాదం జరిగితే అందుకు బాధ్యులు పట్టాభి, మధుమూర్తి అంటూ పోలీస్ స్టేషన్‌లో కంప్లయింట్ ఇచ్చేశాడు.

గడువు మరో మూడురోజులే వుందనగా పరమశివం మరోసారి హెచ్చరించాడు ఆ ఇద్దర్నీ.

ఆ ఇద్దరెంత ప్రయత్నించినా పరమశివం కొడుకే తమకు నష్టం కలిగించిందంటూ ప్రూవ్ చేయలేకపోయారు. తప్పనిసరి పరిస్థితుల్లో గడువు ఆఖరి రోజున పట్టాభి, మధుమూర్తి తమ వ్య క్తిగత ఆస్తుల్ని అప్పటికప్పుడు తెగనమ్మి పరమశివానికి యివ్వవలసిన నాలుగున్నరలక్షల రూపాయలు యిచ్చేశారు.

పట్టాభి చివరగా అన్న మాటలు--

“మేం చేసింది తప్పా ఒప్పా అనేది అలా వుంటే-- నీ కొడుకు మూలంగా మేం లక్షలు కోల్పోయాం. నీవు భాగస్వామ్యం నుంచి తప్పు కోవటం మూలంగా కంపెనీపరంగా కూడా దెబ్బతిన్నాం.

ఈ దెబ్బల్ని మేమంత తేలిగ్గా మర్చిపోలేదు. ఈ రోజునుంచి అనుక్షణం దెబ్బతిన్న ఈ సంఘటల్నే నెమరు వేసుకుంటూ చట్టానికి దొరకకుండా నీ కుటుంబాన్ని సర్వనాశనం చేస్తాం.

నాది పాము పగ. కాటేసేంతవరకు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టని పట్టుదల నాది గుర్తుంచుకో".

పట్టాభి బెదిరింపులకు పరమశివం కొద్దిక్షణాలు భయపడినా తన డబ్బు తనకొచ్చిందన్న ధైర్యంతో వెళ్ళిపోయాడు.

"ఆ ఉదయ్‌గాడు, ఆ పిల్లాడు గంజాయిని తగలబెట్టించారన్నది నిజం. ఉదయ్ తండ్రి జీవితాంతం కుళ్ళి కుళ్ళి చచ్చేలా ఒక పథకం వేయాలి. ఆ నల్లపిల్లాడు పరమశివం ప్రాణమిత్రుడు శశిభూషణ్ కొడుకు. ఒకడికిప్పుడు చేతినిండా కావల్సినంత డబ్బుంది. మరొకడు చట్ట సంబంధమైన వ్యవహారాల్లో రాటుదేలినవాడు. అందుకే మన పథకం వాళ్ళిద్దర్నీ చాపనాశనం చేయాలి" పట్టాభి కసిగా తాగుతున్నాడు.

"కాని ఎలా?" మధుమూర్తి సాలోచనగా అన్నాడు.

"రంగంలో మనం లేకుండా ఆ పని జరిగిపోవాలి అంటే మూడో వ్యక్తి రంగప్రవేశం చేయాలి. ఎవర్ని దింపాలి?" పట్టాభి తీవ్రంగా యోచిస్తున్నాడు.

"ఆ రాజర్షిని దింపితే?" మధుమూర్తి మతలబుకు పట్టాభి ఓ క్షణం ఉలిక్కిపడ్డాడు.

"అతను ఖచ్చితంగా మన పనిని నెరవేర్చగలడు"

"కాని రాజర్షి చాలా ప్రమాదకరమైన వ్యక్తి. మనం పరమశివం, శశిభూషణ్‌ల మూలంగా అన్యాయమయిపోయామన్న అబద్ధాల్ని చాలా జాగ్రత్తగా అతని మనసులో నాటాలి. పని పూర్తయ్యేవరకూ ఆ అబద్ధాన్ని నిజమనే రాజర్షిని నమ్మించగలగాలి. పొరపాటున మధ్యలో అసలు విషయం బయటకు పొక్కిందో చేతబడి తిరగబడుతుంది. అప్పుడిక రాజర్షిలాంటి మహామేధావి పన్నే వలయం నుండి తప్పించుకోవటం మనతరం కాదు. ఇంకెవరి తరం కాదు. కనుక అతన్ని రంగంలోకి దించటం చాలా ప్రమాదకరమనిపిస్తోంది నాకు."

మధుమూర్తి ఆలోచిస్తున్నాడు.

"అయినా మరో మార్గం కనిపించటం లేదు. తప్పదు. రిస్క్ తీసుకుందాం" అన్నాడు పట్టాభి అప్పటికప్పుడే ఒక నిర్ణయానికొస్తూ.

అప్పటికప్పుడే దుర్గాదాసుని పిలిపించాడు పట్టాభి.

తాము దిసుకున్న నిర్ణయాన్ని దుర్గాదాసుకి చెప్పేశాడు.

"మతి వుండే ఈ నిర్ణయం తీసుకున్నారా? ఇలా అడుగుతున్నందుకు క్షమించాలి... కాకపోతే మీ ఉప్పు, కారం తింటున్నవాడ్ని... అందుకే హెచ్చరిద్దామని చెప్పాను."

దుర్గాదాసు హెచ్చరికకి మధుమూర్తి మరింత భయపడ్డాడు.

"బలవంతుడయితే అంతకంటే మరింత బలవంతుడ్ని తెస్తే సరి పోతుంది. శారీరక బలానికి పోటీ లేదు. అతను నేలమీద సింహంలాంటి వాడయితే, అకాశంలో డేగలాంటివాడు. నీటిలో తిమింగలంలా మనల్ని మింగేస్తాడు. ఈ మూడుచోట్లా వీలుపడకపోతే నరసింహస్వామిలా సంధిలో మింగేయగలడు. మీ యిష్టం.... మరోసారి ఆలోచించుకోండి

కాదు.... తప్పదూ అంటే వెళతాను."

దుర్గాదాసులాంటి నరరూప రాక్షసుడు సయితం రాజర్షి పేరు చెప్పగానే అలా భయపడ్డాడంటే? ఈ సారి పట్టాభికూడా భయపడ్డాడు.

0 0 0

రాజర్షి...రాజర్షి...రాజర్షి....ఆరడుగుల పొడగిరి కాదు....అందమైనవాడు కాదు.... అనితర సాధ్యమైన శారీరక బలమున్నవాడు కాదు. మరతనిలో వున్న ప్రత్యేక శక్తి సామర్థ్యాలేమిటి?

=====

ఈ దేశపు ఆర్థిక వ్యవస్థకు అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాలి.

లేదంటే మధ్యతరగతి మిధ్యాజీవులు ఫైనాన్స్ కంపెనీల పదునైన కోరల్లో చిట్‌ఫండ్ కంపెనీల ఛీటింగ్స్‌లో ఛిద్రమైపోతారు.

==========================================================

కేవలం అతని మేధస్సు... యుగంధరుడి రాజకీయ దురంధరత, కౌటిల్యుని మేధస్సు అప్పాజీ చతురత అతనిలో దాగున్నాయి. అతని ఇల్లు నగరానికి దూరంగా నందనోద్యానవనాలతో విశాలమైన లయనికుంజాలతో నిండి వుంటోంది.

చూడటానికి పైకి పూరిల్లులా కనిపించినా లోపల ఫోన్, టి.వి, రేడియో, వీడియోలాంటి అత్యాధునిక సౌకర్యాలన్నీ వుంటాయి.

జాతీయ దినపత్రికలు మొత్తం ప్రతిరోజూ వస్తుంటాయక్కడికి.

అతనెవరో? ఎక్కడినుండి వచ్చాడో? అతని గమ్యమేమిటో ఎవరికి తెలియదు.

చూడటానికి సన్నగా రివట్లా బలహీనంగా కనిపిస్తాడు.

కాని...

అతని చూపులు ఎదుటివాడి అంతరంగాన్ని అవలీలగా పట్టేయగలంత వాడిగా వేడిగా వుంటాయి.

ఎవరన్న ఏదన్నా చెబుతుంటే వింటున్నాడో, లేదో అన్నట్లుగా వుంటుందతని వాలకం.

అరమూసిన కనురెప్పల వెనుక అగ్నికణాలే వుంటాయో, అనంత ప్రేమవాహిని అమృతపు జల్లులే వుంటాయో ఎవరికీ అవగతం కాదు.

కాదు, కానివ్వడు. ఎవరన్నా ఏదన్నా అన్యాయం జరిగింది.